క్లుప్తంగా

కిన్నెరసానిని సందర్శించిన రైల్వే అధికారి

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసాని జలాశయాన్ని సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మెకానికల్ మేనేజర్ శ్రీనివాస్ శనివారం సందర్శించారు. డీర్ పార్క్‌లోని దుప్పులను పరిశీలించాక రిజర్వాయర్‌లో బోటు షికారు చేశారు. యానంబైల్ రేంజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాగర్జన

జూలూరుపాడు: జిల్లా కేంద్రం కొత్తగూడెంలో ఆదివారం జరగనున్న సీపీఐ ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్రకుమార్ పిలుపునిచ్చారు. శనివారం జూలూరుపాడులో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికై లక్షలాది మంది ప్రజలను చైతన్య పరిచేందుకే ఈ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు, చింతా స్వరాజ్‌రావు, ఎస్కే నాగుల్ మీరా, యల్లంకి మధు, ఎస్కే చాంద్‌పాషా, గార్లపాటి వీరభద్రం, పత్తిపాటి మహేష్, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల తీరుపై నిరసన



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణంలోని శ్రీ చైతన్య కే1 పాఠశాలలో పాఠ్యపుస్తకాలు యూనిఫాం పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లిలోని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పాఠశాలోని ప్రిన్సిపాల్ గదిలోని ఫర్నిచర్‌ను పగలగొట్టారు. సంఘం జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంను అధిక ధరలకు అమ్ముతున్నారని, దీంతో తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నవీన్, అభిమిత్ర, నాగకృష్ణ తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కొత్తగూడెంఅర్బన్: ఓ మహిళకు తాను పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు అప్పగించారు. వివరాలు... కొత్తగూడెం పట్టణ పరిధి గాజులరాజం బస్తీకి చెందిన వి.భవాని తన ఇద్దరు కుమార్తెలు, కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాత్రి రైతుబజార్ నుంచి ప్రభుత్వ ఆస్పత్రి ఏరియాకు ఆటోలో వెళ్లారు. ఈ క్రమంలో ఆటోలో సెల్‌ఫోన్ మర్చిపోయారు. తరువాత గమనించిన ఆమె వెంటనే త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ అబ్బయ్య వెంటనే స్పందించి సెల్ సిగ్నల్ ఆధారంగా ఫిర్యాదు చేసిన అరగంటలో సెల్‌ఫోన్‌ను గుర్తించి, ఆ ఫోన్‌ను తెప్పించి భవానికి అప్పగించారు. ఫిర్యాదుకు వెంటనే స్పందించిన త్రీటౌన్ పోలీసులను భవాని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మెరుగైన వైద్యం అందించండి



జీఎం షాలేమురాజుకు వినతిపత్రం అందజేస్తున్న బీఎంఎస్ నాయకులు

ఇల్లెందు: కేటీసీలో పని చేసే సింగరేణి కార్మికులకు అక్కడి డిస్పెన్సరీలో డాక్టర్, సిబ్బంది లేక వైద్యం అందటం లేదని బీఎంఎస్ ఉపాధ్యక్షుడు నాయిని సైదులు అన్నారు. శనివారం బీఎంఎస్ ఆధ్వర్యంలో ఏరియా జీఎం షాలేము రాజుకు వినతిపత్రం అందజేశారు. సైదులు మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల కోసం ఎన్నో స్కీంలు చేపడుతున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ కేటీసీలో మాత్రం డిస్పెన్సరీలో రోగులకు మందులు లేవు, డాక్టర్ లేరు, సిబ్బంది కూడా లేరని ఎలా వైద్యం అందుతుందని ప్రశ్నించారు. తక్షణమే రెగ్యులర్ వైద్యుడిని నియమించాలని, మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. లీలాకృష్ణ, ఆరుట్ల మాధవరెడ్డి, తోకల శివకుమార్ పాల్గొన్నారు.

15 మందిపై కేసు నమోదు

జూలూరుపాడు: ఆస్తి పంపకాలకు సంబంధించి ఘర్షణ పడిన ఇరువర్గాల్లో పదిహేను మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పాపకొల్లుకు చెందిన మంద్రాజుల కృష్ణయ్య, సత్యవతి దంపతులు గొడవల కారణంగా విడిగా ఉంటుండడంతో ఆస్తి పంపకానికి శనివారం వెంగన్నపాలెం శివారులో ఇరువర్గాల బంధువులు, పెద్దలు పంచాయతీ చేశారు. ఈ సమయంలో మాటామాట పెరిగి ఇరువర్గాల వారు దాడులకు దిగగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్సై గణేష్, సిబ్బంది పదిహేను మందిపై కేసు నమోదు చేశారు.

బాస్కెట్‌బాల్ టోర్నీ ప్రారంభం

- విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలి
- కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా



క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరిస్తున్న అతిథులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం సీఈఆర్ క్లబ్‌లో శనివారం జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌ను కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు ప్రారంభించారు. సరళ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఉమ్మడి జిల్లాకు చెందిన పురుషులు, మహిళల జట్లకు బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు రెండు రోజులు జరగనున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నలుమూలల నుంచి సూమారు 150 మంది క్రీడాకారులు తరలివచ్చారు.

ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు మాట్లాడుతూ.. క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సింగరేణి జీఎం బసవయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, ఖమ్మం బాస్కెట్ బాల్ సెక్రటరీ రమణ, సింగరేణి స్పోర్ట్స్ మేనేజర్ గట్టు స్వామి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.మహీదర్, టీబీజీకేస్ నాయకులు సోమిరెడ్డి, జేబీ మోహన్, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో రాజీపడితే చట్టబద్ధత



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న చంద్రికారెడ్డి

ఇల్లెందు: గ్రామస్థాయిలో రాజీపడిన కేసులకు చట్టబద్ధత ఉండదని, అదే కోర్టులో రాజీపడిన కేసులకు చట్టబద్ధత ఉంటుందని మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, ఇల్లెందు ప్రిన్సిపల్ కోర్టు న్యాయమూర్తి డి.కీర్తి చంద్రికారెడ్డి తెలిపారు. శనివారం ఇల్లెందు కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ హైకోర్టు ఆదేశంతో జిల్లా కోర్టు సూచనలతో ఇల్లెందు ప్రిన్సిపల్ కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజీ పడటం అంటే ఒకే కేసులో ఇరువురు గెలిచినట్లేనన్నారు. ఇట్టి కేసులకు అప్పీల్‌కు వెళ్లే చాన్స్ ఉండదని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రకాష్, కమిటీ సభ్యులు బి.రవికుమార్, ఎస్.సత్యనారాయణ, కీర్తి కార్తీక్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కనీస వేతనాల జీఓలను సవరించండి



మాట్లాడుతున్న మధు

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్రంలో 12 ఏళ్లుగా పునరుద్ధరణకు నోచుకోని షెడ్యూల్డ్ పరిశ్రమల కనీస వేతనాల జీఓలను సవరించి కొత్త జీఓలను పునరుద్ధరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే సెక్యూరిటీ గార్డ్స్, బిల్డింగ్స్ అండ్ మెయింటెనెన్స్ సహా అయిదు రంగాల జీఓలను సవరించినప్పటికీ వాటికి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న 79 షెడ్యూల్డ్ పరిశ్రమల జీఓలను సవరించి కొత్త జీఓలు ఇవ్వాలని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల ఆర్థిక, సామాజిక సమస్యలను పక్కదారి పట్టించడం కోసం మతం పేరుతో రెచ్చగొడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏజే రమేష్, పద్మ, ఈసం వెంకటమ్మ, డి.వీరన్న, కే.బ్రహ్మాచారి, కే.సత్యనారాయణ, నర్సిరెడ్డి, ఎస్ఏ నబీ, దొడ్డ రవి, సుశీల, సుల్తానా, టి.కృష్ణ, గుర్రం రాములు, నిమ్మల మధు, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాల్వంచరూరల్: దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో లడ్డూ ప్రసాదాలను తయారు చేసేందుకు ఒక కుక్ పోస్టును భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 38 సంవత్సరాల వయస్సులోపు ఉన్నవారు కనీసం ఏడో తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులని, 13వ తేదీ లోపు స్వయంగా లేదా రిజిష్టర్ పోస్టు ద్వారా కార్యాలయానికి చేరేవిధంగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కాంపౌండ్ వాల్, ఫ్లోరింగ్ పనులకు టెండర్..

శ్రీకనక దుర్గ (పెద్దమ్మతల్లి) ఆవరణంలో నిర్మాణం చేసిన రెండు ఫంక్షన్ హాల్స్ చుట్టూ కాంపౌండ్, సీసీ ఫ్లోరింగ్ నిర్మాణ పనులకు ఇ– ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఈనెల 6 నుంచి 20వ తేదీ వరకు టెండర్లు అందజేయవచ్చని ఈఓ ఒక ప్రకటనలో తెలిపారు.

తండాలో ఎమ్మెల్యే పర్యటన

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ శనివారం టేకులపల్లి మండలం తొమ్మిదోమైలు తండాలో పర్యటించారు. వీధుల్లో కలియదిరిగారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో 10 మంది సభ్యులు రైతు ఉత్పత్తిదారుల సంస్థగా ఏర్పడి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫర్టిలైజర్ షాపుని ఎమ్మెల్యే ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. సర్పంచ్ జర్పుల బిచ్చా, ఇస్లావత్ సీతారాం, తేజావత్ మంగీలాల్, ఎఫ్‌పీఓ సభ్యులు పాల్గొన్నారు.

రేపు తెలంగాణ 2 కే రన్

కొత్తగూడెంటౌన్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ 2 కే రన్‌ను విజయవంతం చేయాలని ఎస్పీ డాక్టర్ వినీత్ పిలుపునిచ్చారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఉదయం 10 గంటలకు లక్ష్మీదేవిపల్లి మండలంలోని మార్కెట్ యార్డ్ నుంచి ప్రకాశం స్టేడియం వరకు 2కే రన్ ఉంటుందని చెప్పారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇసుక లారీల తనిఖీ

పాల్వంచరూరల్: మండలంలోని ఆర్‌టీఏ చెక్‌పోస్టు వద్ద శనివారం పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ భద్రాచలం, బూర్గంపాడు ప్రాంతాల నుంచి పాల్వంచ మీదుగా ఇసుకను తరలిస్తున్న లారీలను నిలిపివేసి తనిఖీ చేశారు. ఈ మేరకు ఇసుక అనుమతులు, లారీ, డ్రైవర్ల లైసెన్స్‌లను పరిశీలించినట్లు డీఎస్పీ తెలిపారు. అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలి



మాట్లాడుతున్న పృథ్వీ

ఇల్లెందు: ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకరావాలని, గుర్తింపు లేని ప్రైవేట్ పాఠశాలలను రద్దు చేయాలని ప్రజాపంథా అనుబంధ పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సంధ్య, కె.పృథ్వీ డిమాండ్ చేశారు. శనివారం ఇల్లెందులోని ప్రజాపంథా కార్యాలయంలో కొత్తగూడెం డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ... కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల భారం పెరిగిందని, దీనివల్ల విద్యార్థుల తల్లిదండ్రులు తలడిల్లిపోతున్నా విద్యాశాఖ పట్టించుకోవటం లేదన్నారు. ఫీజులు కట్టడి చేస్తామంటూ తొమ్మిదేళ్ల నుంచి పాలకులు మోసం చేస్తున్నారని ఆరోపించారు. తిరుపతిరావు కమిటీ, మంత్రుల కమిటీ అంటూ కాలయాపన చేస్తోందని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. సమావేశంలో వంశీవర్ధన్, పార్థసారధి, సాయి, గంగాధర్, గణేష్, ఉదయ్, సుమిత్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల మనుగడకు ప్రమాదం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: 11 బీసీ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చితే గిరిజనుల మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందని ఎల్‌హెచ్‌పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్ నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం సురారంలో ఆయన ఈనెల 20న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులను విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర పన్నుతోందన్నారు. దీనిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మైదాన ప్రాంతంలో ఆదివాసీ గిరిజనుల కోసం ఐటీడీఏను ఏర్పాటు చేయాలని కోరారు. నూతనంగా ఏర్పడిన గిరిజన తండాల గ్రామ పంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో గుగులోత్ కేశవ్ నాయక్, లకావత్ నాగేశ్వరరావు, బానోత్ హరిలాల్, మాలోత్ రాములు, ఇస్లావత్ జగన్నాథం, రమేష్, హరి, కీర్యా, కృష్ణ, వరలక్ష్మి, బాలి, రేణుక, పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే దశాబ్ది ఉత్సవాలు

ఇల్లెందురూరల్: తొమ్మిదేళ్ల పాలనలో తన వైఫల్యాలను కప్పిపుచ్చి వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తోందని ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి నాయిని రాజు విమర్శించారు. దీక్షా దివస్‌లో భాగంగా మండలంలోని రేపల్లెవాడ, కొమరారం గ్రామాలలో ప్రజాపంథా ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుదీర్ఘ ఉద్యమంలో వందల సంఖ్యలో ప్రజలు ఆత్మబలిదానం చేస్తే వారి ఆకాంక్షలను తుంగలో తొక్కిన రాష్ట్ర ప్రభుత్వం రాచరిక పాలన సాగిస్తోందని ఆరోపించారు. గతంలో ఇచ్చిన హామీలైన నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, పోడు భూములకు పట్టాలు, ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం, రుణమాఫీ, దళితబంధు, రేషన్‌కార్డులు తదితర ఎన్నింటినో పక్కన పెట్టి పేదలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్ ఏకపక్ష పాలనను దించేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఈనెల 12న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్, బోసు, ఆజ్మీర బిచ్చా, కాంపాటి ప్రసాద్, శాంతారావు, ధారావత్ దేవా, కోరం ముత్తమ్మ, కుంజ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'చలో కలెక్టరేట్'



మాట్లాడుతున్న కృష్ణ

జూలూరుపాడు: ఈనెల 12న జరగనున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం జూలూరుపాడులో జరిగిన ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ సర్కార్ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరుతూ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో కలెక్టరేట్ చేపట్టినట్లు చెప్పారు. కోటి ఆశలతో విద్యార్థులు, యువత, ఉద్యోగులు, సకల జనులు తెలంగాణ సాధన కోసం ఉద్యమించారన్నారు. తమ ఉద్యోగాలు తమకే వస్తాయని, ఇంటికో ఉద్యోగం వస్తుందని ఆశపడినట్లు చెప్పారు. రైతుల పోడు భూములకు పట్టాలు వస్తాయని, ఎస్సీ, ఎస్టీలు మూడు ఎకరాల సాగు భూమి, రైతు రుణమాఫీ అవుతుందని, నిరుపేదలు రేషన్ కార్డులు ఇళ్లు, పెన్షన్లు అందరికీ వస్తాయని ఆశపడ్డ ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. ధరణి పోర్టల్‌ను సరిచేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

30న ప్రగతి భవన్ ముట్టడి

సుజాతనగర్: రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు అక్రమాలపై తక్షణమే విచారణ చేపట్టాలని, లేని పక్షంలో జూన్ 30న ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్ నాయక్ తెలిపారు. ఆ సంఘం ఆధ్వర్యంలో సీతంపేట బంజర గ్రామంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రస్ట్ ఏర్పాటు వెనక రాజకీయ స్వలాభమే తప్ప నియోజకవర్గ ప్రజలపై ప్రేమ కాదన్నారు. మతపరమైన సమావేశాలు ఏర్పాటు చేస్తూ, ఓట్ల కోసం చేస్తున్న ప్రయత్నాలను నియోజకవర్గ ప్రజలు గమనించాలన్నారు. కరోనా సమయంలో రూ.కోట్లు వెనకేసుకొని ట్రస్ట్ ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తున్న డీహెచ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీపీఐ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

టేకులపల్లి: కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఆదివారం జరగనున్న సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నేత గుగులోత్ రాంచందర్‌నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మండలంలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ప్రజాసమస్యల పరిష్కారం, సింగరేణి, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, పోడు సాగుదారులందరికీ పట్టాలు, రాజ్యాంగ, లౌకిక వ్యవస్థల పరిరక్షణ కోసం ఈ ప్రజాగర్జన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, అజీజ్ పాషా, పువ్వాడ నాగేశ్వరరావు, చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకటరెడ్డి, గోరెటి వెంకన్న, వందేమాతరం శ్రీనివాస్, బాగం హేమంతరావు, సాబీర్‌పాషా, పోటు ప్రసాద్, వాసిరెడ్డి సీతారామయ్య, మనీష్ కుంజం, బి.అయోధ్య, రావులపల్లి రాంప్రసాద్, మహ్మద్ మౌలానా, దండి సురేష్ తదితరులు పాల్గొని తమ అమూల్యమైన సందేశాలు ఇస్తారని తెలిపారు. ఎజ్జు భాస్కర్, గుగులోత్ శ్రీను, భద్రయ్య, శ్రీరాములు, పాల్గొన్నారు.

చిరు వ్యాపారులపై భానుడి ప్రభావం



లక్ష్మీదేవిపల్లిలో మూసివేసిన దుకాణాలు

పాల్వంచరూరల్: ఎండలు భగభగ మండుతుండడంతో ప్రజలు విలవిలలాడుతున్నారు. రెండు, మూడురోజులుగా ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం పది గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. దీంతో మండలంలోని చిరువ్యాపారులు మధ్యాహ్నానికే దుకాణాలను మూసివేసి ఇళ్లకు వెళ్లి తలదాచుకుంటున్నారు. చిరువ్యాపారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు రోడ్ల వెంట తోపుడు బండ్లు, బడ్డీ కొట్లు పెట్టుకుని వ్యాపారం చేసుకుంటేనే పూట గడుస్తుంది. ఎండలు మరీ తీవ్రంగా ఉండడంతో వినియోగదారులు రావడం లేదని, ఒక్కపూట మాత్రమే అంతంత మాత్రంగానే వ్యాపారాలు నడుస్తున్నాయని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం లక్ష్మీదేవిపల్లి పంచాయతీలోని జాతీయ రహదారి వెంట, పెద్దమ్మగుడి వద్ద ఉన్న చిరువ్యాపారుల దుకాణాలను ఎండ తీవ్రతకు మధ్యాహ్నం వ్యాపార దుకాణాలను మూసివేశారు. దీంతో ఆలయం చుట్టుపక్కల వెలవెలబోయింది.